నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ


VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 4 | సంచిక: 347 | గురువారం, 14 మే 2026 | పేజీలు - 8 | వెల : 3/-



## పుదుచ్చేరి పీఠంపై రంగస్వామి

**ముఖ్యమంత్రిగా ఐదోసారి ప్రమాణం.. ప్రజలకు కృతజ్ఞతలు చెప్పిన సీఎం**

పుదుచ్చేరి రాజకీయాల్లో మరోసారి రంగస్వామి హవా కొనసాగింది. ఐదోసారి పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా రంగస్వామి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్ నివాస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాశనాథన్ ఆయనతో పదవి, గోప్యత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నాబిన్ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

వాస్తవ తెలంగాణ న్యూస్:

## లుక్ అవుట్.. నోటీసులివ్వండి

- భగీరథ్ విదేశాలకు పారిపోకుండా జారీ చేయాలి
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్
- బాలిక ఫొటోలు రిలీజ్ చేసింది బీఆర్ఎస్సే
- వెంటనే వారిని అరెస్ట్ చేయాలి
- బాధితురాలికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం

3



## నీట్-యుజి పేపర్ లీక్..సుప్రీంకోర్టులో పిటిషన్



**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ న్యూస్:** నీట్ -యుజి పేపర్ లీక్ కావడంతో ఆ పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ పై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనా స్థానంలో కొత్త సంస్థను నియమించాలి లేదా పూర్తిగా పునర్నిర్మించాల్సిందిగా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలైంది. ప్రశ్నాపత్రం లీకేజీ, అక్రమాల నేపథ్యంలో వైద్య విద్యకు సంబంధించి మే 3న నిర్వహించిన జాతీయ అర్హతా పరీక్ష (నీట్ -యుజి 2026)ను రద్దు చేస్తున్నట్లు ఎన్టిఎ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు సుమారు 22 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. తిరిగి పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించింది. పేపర్ లీక్ పై సీబీఐ విచారణకు ఆదేశించారు. నీట్ పరీక్ష నిర్వహణ కోసం ''మరింత పటిష్టమైన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ '' అవసరమని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) స్పష్టం చేసింది. కోర్టు నేరుగా జోక్యం చేసుకుని, పరీక్షను తిరిగి నిర్వహించడాన్ని పర్యవేక్షించేందుకు, ఇకపై ఎటువంటి లీకులు జరగకుండా చూసుకోవడానికి, సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జీ అధ్యక్షతన, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని నియమించాలని పేర్కొంది. సుప్రీంకోర్టు నియమించిన మధ్యంతర పర్యవేక్షణ కమిటీ, సవరించిన పరీక్షా ప్రక్రియ భద్రతను ధృవీకరించి, నిర్ధారించే వరకు కోర్టు నియమించిన ఉన్నత స్థాయి కమిటీ పర్యవేక్షణలో నీట్ యుజి 2026 పరీక్షను తిరిగి నిర్వహించాలని ఆదేశించాలని పిటిషన్ కోరింది. సాక్ష్యాధారాలను నమోదు చేయడంలో వైఫల్యం వంటి ప్రమాదాలను నివారించేందుకు, గతంలో జరిగిన ప్రశ్నాపత్రాల లీకుల నేపథ్యంలో సూచించిన విధంగా ప్రశ్నాపత్రాలను డిజిటల్ లాక్ చేయడాన్ని, కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)విధానానికి మారడాన్ని తప్పనిసరి చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను న్యాయవాది తన్వి దూబే దాఖలు చేశారు. నాలుగు రోజుల్లోగా సుప్రీంకోర్టుకు దర్యాప్తు నివేదికను సమర్పించాలని సిబిఐని ఆదేశించాలని ఫైమా కోరింది. సమాచారం లీక్ వెనుక పనిచేస్తున్న నెట్‌వర్క్‌ల వివరాలు, జరిగిన అరెస్టులు, అభియోగాలు ఎదుర్కొంటున్న వ్యక్తులు, ప్రాసిక్యూషన్ పురోగతి వివరాలు తప్పనిసరిగా ఉండాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. అక్రమాలను పారదర్శకంగా గుర్తించేందుకు వీలుగా నీట్-యుజి 2026 కేంద్రాల వారీ ఫలితాలను దీనా తక్షణమే ప్రచురించాలని పిటిషన్‌లో కోరారు.

## ఓఎస్‌డీగా జ్యోతిష్యుడు..నియామకం రద్దు



**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ న్యూస్:** తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ తన వ్యక్తిగత జ్యోతిష్యుడు రాజన్ పండిట్‌ను 'ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ' గా నియమించుకోవడంపై రాజకీయంగా దుమారం రేగుతోంది. తాజాగా ఈ అంశంపై టీవీకే ప్రభుత్వం స్పందించింది. రాజన్ పండిట్‌ను నియమాకాన్ని రద్దు చేసింది. కాగా, విజయ్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్ అసెంబ్లీ వేదికగా తీవ్రంగా ఖండించారు. జ్యోతిష్యుడికి అధికారిక పదవి కట్టబెట్టడంపై ఆమె మండిపడుతూ, రాజన్ పండిట్ విజయ్‌కు వ్యక్తిగత గురువు అయితే ఆయనను సొంత పనులకే పరిమితం చేసుకోవాలని, ప్రభుత్వ వ్యవస్థలోకి తీసుకురావడం సరికాదని హితవు పలికారు. యువత ఎంతో నమ్మకంతో విజయ్‌కు ఓట్లు వేశారని, ఇప్పుడు ఇటువంటి నిర్ణయాల ద్వారా భావి తరానికి ఆయన ఎలాంటి ఉదాహరణగా నిలుస్తున్నారో సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## సోనియా గాంధీకి అస్వస్థత




**హైదరాబాద్ : వాస్తవ తెలంగాణ న్యూస్:** కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలు తలెత్తడంతో ఆమెను గురువారం గురుగ్రామ్‌లోని వేదాంత ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నారు. పార్టీ వర్గాల ప్రకారం, సోనియా గాంధీ ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

## బీరప్ప స్వామి దయతో ప్రజలు చల్లగా ఉండాలి: మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి

2

## ఎన్‌టిఎను రద్దు చేయాలి: పినరయి విజయన్



**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ న్యూస్:** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేసి, గతంలో మాదిరిగా పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు తిరిగి అప్పగించాలని కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం)పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్ పేర్కొన్నారు. నీట్-యుజి పరీక్షను రద్దు చేసిన ఎన్ టి ఎను రద్దు చేయాలని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. నీట్- యుజి పరీక్ష చుట్టూ నెలకొన్న వివాదం, ప్రశ్నాపత్రాల లీకేజీలు అత్యంత తీవ్రమైనవి, ఖండించదగినవని అన్నారు. కేంద్రం పరీక్షల నిర్వహణ బాధ్యతను ఎన్ టి ఎకు అప్పగించిన తర్వాత ప్రశ్నాపత్రాలు లీక్ కావడం ఇదే మొదటిసారి కాదని అన్నారు. ఈ పరిస్థితి సంవత్సరాల తరబడి కఠోరశ్రమతో పరీక్షకు సిద్ధమయ్యే లక్షలాది మంది విద్యార్థుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు సంవత్సరాల తరబడి కృషి, ఆర్థిక ఇబ్బందులతో పరీక్షల కోసం సిద్ధమవుతారని, కానీ ఇటువంటి అవకతవకలు వారికి సరైన అవకాశాలను దూరం చేస్తున్నాయని మండిపడ్డారు. పరీక్షలను విశ్వసనీయంగా నిర్వహించాల్సిన బాధ్యత గలవారు భద్రతను కల్పించడంలో విఫలమవడం దేశ విద్యావ్యవస్థకు పెద్ద అవమానమని అన్నారు. కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ మాఫియాల పాత్రపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమగ్రమైన, పారదర్శకమైన, నిర్ణీత కాలంలో విచారణ జరిగేలా చూడాలని పిలుపునిచ్చారు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడానికి కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రయోగాలకు ప్రయోగశాల కాదని, ప్రవేశ పరీక్షల నిర్వహణను అపహాస్య చేస్తూ విద్యార్థుల కలలను నాశనం చేయవద్దని కోరారు.

## ప్రధాని.. పొదుపు మంత్ర!

- కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించాలని ఆదేశం
- అలాగే ఎస్కార్ట్, భద్రత సిబ్బంది కూడా కుదింపు
- సాధ్యమైనంతవరకు ఈవీ వాహనాలు ఉండాలని సూచన
- మోదీ బాటలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కూడా..



ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమౌతున్నాయి. సంవత్సరం పాటు బంగారం కొనుగోళ్లను నిలిపివేయాలని మోదీ సూచించారు. బంగారాన్ని కొనకుండా ఉండాలని కోరారు. వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతులను అవలంబించాలని, దేశీయ లేదా అంతర్జాతీయ అనవసర ప్రయాణాలను తగ్గించుకోవాలని చెప్పారు. పెట్రోల్, డీజిల్‌తో పాటు చివరికి వంటనూనె వినియోగాన్ని సైతం తగ్గించుకోవాలని సూచించారు.

7

వాస్తవ తెలంగాణ న్యూస్:

# సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

## - గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమారి గౌడ్‌కు వినతి



**గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సెంట్రింగ్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించి, తమకు రక్షణ కల్పించాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కోరారు. ఈ మేరకు బుధవారం గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ సి.హెచ్. కుమారి గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. నిర్మాణ ప్రాంతాల్లో సెంట్రింగ్ సామాగ్రి దొంగతనానికి గురవుతోందని, దొంగలను గుర్తించి కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. దొంగిలించిన మెటీరియల్‌ను కొనుగోలు చేసే పాత సామాన్ల దుకాణదారులపై నిఘా ఉంచాలని, అలాగే భవన నిర్మాణ సమయంలో ప్రమాదవశాత్తు కార్మికులు పైనుంచి పడి మరణిస్తే, ఎటువంటి విచారణ లేకుండా సెంట్రింగ్ కాంట్రాక్టర్లపై నేరుగా కేసులు నమోదు చేయకూడదని విన్నవించారు. ప్రతి అమావాస్య రోజున సెంట్రింగ్ పనులకు సెలవు ప్రకటించాలని, దీనికి కార్మిక మరియు పోలీసు శాఖలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు రమేష్, కిషన్, మురళి, సంజీవ రెడ్డి, నాయకులు వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్, రాజు, మండల సెంట్రింగ్ యూనియన్ సభ్యులు వీరేశం, రాజు, కృష్ణ, పోచయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్లస్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలి

## -ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్ ముకుంద రెడ్డి
## -సొసైటీలన్నీ సమిష్టిగా సహకరిచాలి
## -మీడియా అకాడమీ ఛైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రారంభమైన జర్నలిస్టుల ఇళ్ళస్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ ముకుంద రెడ్డి కోరారు. బుధవారం హైదరాబాద్ లోని మీడియా అకాడమీలో జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ళస్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపుతోందని అన్నారు. మీడియా అకాడమీ ఛైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈనెల 21న జరుగనున్న కేబినెట్ సమావేశం నాటికి హైదరాబాద్ లో ఉన్న అన్ని సొసైటీల పూర్తి వివరాలను, జర్నలిస్టుల సంఖ్యతో కూడిన నివేదికను తయారు చేయాలని అన్నారు. ఇందుకు అన్ని సొసైటీలు సమిష్టిగా సహకరించాలని ఆయన కోరారు. అర్హులైన జర్నలిస్టులను మాత్రమే జాబితాలో చేర్చాలని ఆయన సొసైటీల ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఈ సొసైటీని కూడా పరిగణలోకి తీసుకొని జేఏసీలో చేర్చారు. అదేవిధంగా మహాత్మగాంధీ జర్నలిస్ట్స్ సొసైటీని కూడా చేర్చారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ లు తమ సొసైటీ సభ్యుల జాబితా ను సమర్పించారు. ఈ సమావేశంలో ఐఅండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ డీఎస్ జగన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, వివిధ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీల ప్రతినిధులు పాల్గొన్నారు.




# నూతన డాజిల్ స్పోర్ట్స్ మహల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు




**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాసదాశివపేట పట్టణంలోని అశ్రకాంప్లెక్స్ నందు నూతనగా ఏర్పాటు చేసిన బారాడి బ్రదర్స్ కుటుంబ సభ్యులు నేటి యువతను దృష్టిలో ఉంచుకొని డాజిల్ బ్రాండ్ కు సంబందించిన క్లాత్ షోరూంను ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమమైడి రాజును ముఖ్య అతిథులుగా ఆహ్వానించగా వారు వెల్లి ప్రతేక పూజా కార్యక్రమంలో పాల్గొని,. షోరూంని ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇట్టి సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ కస్టమర్లకు అతితక్కువ ధరలో నాణ్య మైన బట్టలు ఈ షాపులో అందుబాటులో ఉన్నాయని ప్రజలకు సూచించారు. ఇట్టి కార్యక్రమంలో బరాడి తిరుపతి రావ్, చలపతి, నాగరాజు, రోహన్ మరియు పి ఎం.ఆర్ యువసేన నాయకులు అనిల్, సోమ శంకర్ గుణాకర్ అఖిల్, ఖర్చర్ల నరేష్ మొదలగు వారు పాల్గొన్నారు.

# బీరప్ప స్వామి దయతో ప్రజలు చల్లగా ఉండాలి: మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి

**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి ఆంజనేయులు** మెదక్ జిల్లా పాపన్నపేట్ మండలంలోని గాంధారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప స్వామి జాతర మహోత్సవాల్లో మండల నాయకులతో కలిసి మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మదేవేందర్ రెడ్డి పాల్గొని బీరప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బీరప్ప స్వామి దయతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు, పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడతాయని అన్నారు. ఇలాంటి ఉత్సవాలు గ్రామాల్లో భక్తి భావనను పెంపొందించడమే కాకుండా ప్రజల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జాతరను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. గ్రామ దేవతల పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసం, భక్తి భావం తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలా గౌడ్,పాపన్నపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరామ్ రెడ్డి,సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షులు కుమ్మరి జగన్ మాజీ సర్పంచ్ లు దావుల. శ్రీనాథరావు,లింగారెడ్డి ఏడుకొండలు,స్రవంతి శ్రీనివాస్ గాంధారి పల్లి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు విశ్వాస్ రెడ్డి, బిఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు,యువకులు, భక్తులు పాల్గొన్నారు.



# సామాజిక సమరసత శంకర్ పల్లి ఖండ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు..

**తొమ్మిది జంటలకు వైభవంగా బద్దం జ్యోతి రెడ్డి గార్డెన్ లో ఘనంగా వివాహాలు..**



**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్ పల్లి సామాజిక సమరాసత ఆధ్వర్యంలో బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బద్దం జ్యోతి రెడ్డి గార్డెన్స్ లో తొమ్మిది గంటలకు ఘనంగా వివాహాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొరివిందా రామచంద్రయ్య (వనవాసి కళ్యాణ ఆశ్రమం) పాల్గొని ప్రధాన వక్త గా ఉపన్యసిస్తూ సమాజంలో అసమానతలు తొలగించడంలో ఇలాంటి కార్యక్రమాలు ప్రధాన పాత్ర పోషి స్థాయని ప్రశంశించారు. హిందూ బంధువులు అందరం దేశానికి సారదులం అన్నారు. రుక్మిణి సా. స. స ప్రాంత మహిళా కన్వీనరు మాట్లాడుతూ అంతరాలు తగ్గించడానికి సామాజిక సమరసత సమాజంలో కీలక పాత్ర పోషిస్తుందని, కుటుంబ వ్యవస్థ, తల్లి తండ్రుల పాత్ర గొప్పదనాన్ని వివరించారు. ఈ వివాహ వేడుకలకు అజయ్ శర్మ ప్రాంత ధర్మ చార్య సహ ప్రముఖ్, పాపిరెడ్డి దామోదర్ రెడ్డి సా. స. స పాలమూరు జిల్లా ఉపాధ్యక్షులు, శంకర్ పల్లి కార్య వర్గ సభ్యులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, ప్రముఖులు సామాజిక కార్యకర్తలు వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. శంకర్ పల్లి కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అతిథులకు భోజన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా శేఖర్ మాట్లాడుతూ మా కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చిన అతిథులకు భోజన కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు.



# దరఖాస్తులకు ఆహ్వానం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ



**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి ఆంజనేయులు** మెదక్ జిల్లా యందు గిరిజన విద్యార్థిని విద్యార్థుల తల్లి తండ్రులకు తెలియజేయునది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతపూర్ లో 2026 - 27 విద్యా సంవత్సరంలో 1వ తరగా ఇశీగ్లిష్ మీడియంలో 6 గురికి (బాలురు3, బాలికలు3) విద్యార్థిని విద్యార్థుల ప్రవేశము కొరకు దరఖాస్తులు ఆహ్వానించినైనది. విద్యార్థిని విద్యార్థులు తేది :01-06-2019 నుండి 31-05-2020 లోపు జన్మించిన వారై ఉండవలెను.ఆసక్తి గల వారు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తు ఫారము నింపి రెండు ఫోటో లతో పాటు సంబందిత తహసిల్దార్ చే దృవీకరించబడిన మీ సేవ నుండి పొందిన కులము , 01-04-2026 ర్వాత తీసుకున్న ఆదాయము, నివాస దృవీకరణ సర్టిఫికేట్ ,విద్యార్థి పుట్టిన తేది ధ్రువీకరణ పత్రముతో పాటు తల్లి తండ్రుల యొక్క సంవత్సర ఆదాయము గ్రామ పరిదిలో రూ.1,50,000/- పట్టణ పరిదిలో రూ.2,00,000/- మించి ఉండరాదు. ఒరిజినల్ దృవీకరణ పత్రములు తపరచవలయును. దరఖాస్తులను ఫారములు ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్, 2వ అంతస్తు, రూమ్ నెం. ఎస్ 17 లో గల జిల్లా గిరిజ భివృద్ధి అధికారి కార్యాలయము, మెదక్ జిల్లా నుండి కార్యాలయపు పని వేళలో ఉచితంగా పొందగల దరఖాస్తులను తేది:-18-05-2026 సాయంత్రం 5.00 గంటల వరకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికా ర్యాలయములో స్వీకరించబడును. అదే విదంగా తేది :22-05-2026 రోజున ఉదయం 11:00 గంటల ల్లా కలెక్టర్ మెదక్ గారి ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థుల తల్లి తండ్రుల సమక్షములో ఎంపిక కమిటి ఆధ్వర్యంలో డ్రా తీసి ఎంపిక చేయబడును. కావున ఈ అవకాశామును విద్యార్థిని విద్యార్థ తండ్రులు సద్వినియోగం చేసుకోగలరని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపార.



# లుక్ అవుట్.. నోటీసులివ్వండి

## భగీరథ్ విదేశాలకు పారిపోకుండా జారీ చేయాలి

- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్
- బాలిక ఫొటోలు రిలీజ్ చేసింది బీఆర్ఎస్సే
- వెంటనే వారిని అరెస్ట్ చేయాలి
- బాధితురాలికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం

కేంద్ర మంత్రి బండి సంజయ్ కొడుకు భగీరథ్ విదేశాలకు పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా అత్యుత్సాహంతో బాధితురాలి ఫొటోలు బయటకు వచ్చాయని ఆరోపించారు. ఫొటోలు బయట పెట్టిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. బండి సంజయ్ కుమారుడి మీద చాలా బలమైన ఆరోపణలు వచ్చాయని, అలాంటి సందర్భంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్న వేదికను ఆయన పంచుకోవటం శోచనీయమన్నారు. కుటుంబ సభ్యులపై ఆ స్థాయి ఆరోపణలు వచ్చినప్పుడు ఆయన ఆ సమావేశానికి వెళ్లాల్సింది.. కాదన్నారు. దీనివల్ల పెద్దవాళ్ల పిల్లలు ఏ తప్పు చేసినా చూడనట్లు వ్యవహరిస్తారనే భావన ప్రజల్లోకి వెళ్లిందన్నారు.

వాస్తవ తెలంగాణ

### దేశం దాటించడం బీజేపీ నైజం

ఏ ఆరోపణలు వచ్చినా సరే తొలుత నిందితులను దేశం దాటించటం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. అందుకే బండి సంజయ్ కుమారుడు దేశం దాటి వెళ్లకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని మరోసారి చెప్పారు. అప్పుడు మాత్రమే విచారణ పారదర్శకంగా జరుగుతుందని విశ్వాసం ప్రజలకు వస్తుందన్నారు.

### బీఆర్ఎస్ వల్లే ఫొటోలు బయటకు.

కొన్ని పార్టీల వాళ్లు ఒక ట్వీట్ వేసి సమస్యను పరిష్కరించినట్లు చెబుతున్నారని అన్నారు. తాను ఎందుకు స్పందించటం లేదంటూ నానా హంగామా చేస్తున్నారని, ఒక ఆడపిల్ల అంశం వచ్చినప్పుడు చాలా సంయమనంగా వ్యవహరించాలన్నారు. అందులోనూ అమ్మాయి మైనర్ అయినప్పుడు ఇంకా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సమాజం మగపిల్లలను క్షమిస్తుందని, కానీ ఆడపిల్లలను క్షమించదన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా అత్యుత్సాహం కారణంగా బాధిత అమ్మాయి ఫొటోలు బయటకు వచ్చాయన్నారు. దీని కారణంగా ఆ అమ్మాయి జీవితం నష్టపోయే ప్రమాదం ఉందని, పోస్ట్ చేసిన ఖాతాలను గుర్తించి వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాము ఎప్పుడైనా ఆడపిల్లలకు అండగా ఉంటామన్నారు

# నవ సమాజ నిర్మాణంలో ఉన్నత విద్యాసంస్థల పాత్ర గణనీయంగా ఉంటుంది










**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాతారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో ప్రజా పాలనబి ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలను మూడవరోజు ప్రతిభగల విద్యార్థులకు, అధ్యాపకులకు, కళాశాలకు సి ఎస్ ఆర్ నిధులను సమకూర్చిన సంస్థల ప్రతినిధులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం ప్రవీణ తెలిపినారు. తారా ప్రభుత్వ కళాశాల లోని 36 మంది విద్యార్థినులకు అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్ తరపున ప్రతి ఒక్కరికి 30 వేల రూపాయల చొప్పున స్కాలర్షిప్ లభించిందని, ఈ స్కాలర్షిప్ ఐదు సంవత్సరాల పాటు సంబంధిత విద్యార్థులకు అందించడం జరుగుతుందని తెలిపినారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్ ప్రతినిధులను సన్మానించడం జరిగిందని తెలిపారు. అదే విధంగా కళాశాలలో ఆచార్యులుగా పదోన్నతి పొందిన ప్రొఫెసర్ మహంతయ్య, ప్రొఫెసర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ విజయ లను సన్మానించడం జరిగిందని తెలిపినారు. అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సంగారెడ్డి ప్రతినిధి కృష్ణ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ పేద బాలికలకు ఉన్నత విద్యాభ్యాసాన్ని అందించడానికి ఈ స్కాలర్షిప్ సదుపాయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఇది సి ఎస్ ఆర్ నిధులతో కొనసాగుతుందని, భవిష్యత్తులో ఈ సదుపాయాన్ని ఇంకా ఎక్కువ మంది విద్యార్థులకు అందేటట్లుగా చేస్తామని, నవ సమాజ నిర్మాణంలో ఉన్నత విద్యాసంస్థల పాత్ర ఎంతైనా ఉందని తెలిపినారు. ఉన్నత విద్యాసంస్థలలో విద్య నాణ్యమైనదిగా ఉంటే సమాజ నిర్మాణము సక్రమంగా జరుగుతుందని తెలిపినారు. అనంతరము కళాశాల నుండి ఎన్ఎస్ఎస్ తరపున ఒరిస్సాలోని గౌహతిలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో మరియు త్రివేంద్రము, కర్ణాటకలో జరిగిన అంతరాష్ట్ర శిబిరాలలో పాల్గొన్న విద్యార్థులు అవని సహస్ర కులకర్ణి మరియు సిహెచ్ రాకేష్ లను సన్మానించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నిర్మల, డాక్టర్ జగదీశ్వర్, ఎన్ఎస్ఎస్ అధికారులు, కళాశాల వివిధ విభాగ అధిపతులు ,అధ్యాపక బృందము అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పుదుచ్చేరి పీఠంపై.. రంగస్వామి

- ముఖ్యమంత్రిగా ఐదోసారి ప్రమాణం
- ప్రజలకు కృతజ్ఞతలు చెప్పిన సీఎం




**వాస్తవ తెలంగాణ** పుదుచ్చేరి రాజకీయాల్లో మరోసారి రంగస్వామి హవా కొనసాగింది. ఐదోసారి పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా రంగస్వామి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్ నివాస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాశనాథన్ ఆయనతో పదవి, గోప్యత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నాబిన్ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం మీడియాతో మాట్లాడిన రంగస్వామి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాలను మరింత సమర్థంగా అమలు చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. పుదుచ్చేరిని సింగపూర్ తరహాలో అభివృద్ధి చేస్తామని రంగస్వామి ప్రకటించారు. మౌలిక వసతులు, పర్యాటకం, సంక్షేమ రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజల ఆశలకు అనుగుణంగా పని చేస్తామని హామీ ఇచ్చారు.

### అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఇక నమస్శివాయం కూడా కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అన్ని సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, కొత్త పథకాలను కూడా ప్రవేశపెడతామని ఆయన చెప్పారు. పుదుచ్చేరి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. అలాగే మల్లాది కృష్ణరావు కూడా త్వరలో మంత్రివర్గంలో చేరనున్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాల ద్వారా సహకారం అందిస్తోందని, దాంతో పర్యాటకం, సదుపాయాల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ఆయన పేర్కొన్నారు. మే 4న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డీఏ) మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంది. ఆల్ ఇండియా N.R. కాంగ్రెస్ (ఎన్ఆర్ కాంగ్రెస్) 12 స్థానాలు గెలుచుకోగా, భారతీయ జనతా పార్టీ నాలుగు స్థానాలు సాధించింది. ఆల్ ఇండియా అన్నా ద్రావిడ మున్నేట్ర కజగం ఒక స్థానంలో విజయం సాధించింది. ప్రతిపక్షంగా ఉన్న ద్రావిడ మున్నేట్ర కజగం ఐదు స్థానాలు గెలుచుకోగా, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఒక స్థానంతో సరిపెట్టుకుంది. తమిళనాడులో సంచలన ఎంట్రీ ఇచ్చిన తమిళగ వెట్రి కజగం పుదుచ్చేరిలో కూడా రెండు స్థానాలు గెలుచుకుని ఖాతా తెరిచింది.

# బక్రీద్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

## గోవుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ సి.వి ఆనంద్ ఆదేశాలు





**వాస్తవ తెలంగాణ న్యూస్ న్యూస్ మెదక్ ప్రతినిధి ఆంజనేయులు** బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ సి.వి ఆనంద్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనరేట్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గోవుల అక్రమ రవాణా, గోవధ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని డీజీపీ స్పష్టం చేశారు. పశువుల రవాణాకు సంబంధించి ఆరోగ్య ధృవీకరణ పత్రాలు, అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పత్రాలు లేకుండా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దులు, చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు, పశువుల రవాణా ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో 24 గంటల నిఘా కొనసాగించాలని సూచించారు. అలాగే గోవుల రవాణా పేరుతో కొందరు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం, అల్లర్లు సృష్టించే ప్రయత్నాలు చేసినా ఉపేక్షించబోమన్నారు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా పోలీసు శాఖదేనని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు ప్రచారాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అలాంటి పోస్టులు పెట్టే వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీ ఆదేశించారు. మసీదులు, ప్రార్థనా స్థలాలు, మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా పోలీసు అధికారులతో మాట్లాడిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్.. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మసీదులు, ప్రధాన కూడళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. గోవుల అక్రమ రవాణాపై కఠిన నిఘా కొనసాగించాలని, చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని తెలిపారు. ప్రజలు పరస్పర సామరస్యంతో, సోదరభావంతో బక్రీద్ పండుగను జరుపుకోవాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో డియస్పిలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, ఆర్డిఓ జయచంద్ర రెడ్డి, సీఐ లు సందీప్ రెడ్డి, జాన్ రెడ్డి,మహేష్, రేణుక, రాజశేఖర్ రెడ్డి, కృష్ణ మూర్తి, సైదా నాయక్, ఎసై గంగా రాజు, వెటర్నరీ డిపార్ట్మెంట్ అధికారులు, పాల్గొన్నారు.

# రాంపల్లి చెరువు సమస్యపై స్పందించినా, శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి.

## - యువ నాయకత్వం తక్షణ చర్యలతో రాంపల్లి చెరువు గుర్రపు డెక్కా తీసివేత..





**కీసర మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగరం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ ముప్పు శ్రీనివాస్ రెడ్డి మరియు యువజన నాయకుడు కౌకుట్ల జీవన్ రెడ్డిల నాయకత్వం మరియు నిరంతర పర్యవేక్షణతో, నాగరం మరియు రాంపల్లి చెరువులలో దీర్ఘకాలంగా పేరుకుపోతున్న గుర్రపు డెక్క సమస్య ఎట్టకేలకు పరిష్కారం దిశగా కదిలింది. ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు గుర్రపు డెక్క ను తక్షణమే తొలగించి, దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ రెండు నెలల క్రితం ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఒక వినతిపత్రం సమర్పించబడింది. ఈ విషయంపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డి, టెండర్ల ప్రక్రియను ప్రారంభించి, శుభ్రపరిచే పనులు మొదలయ్యేలా చూశారు. బుధవారం రాంపల్లి చెరువు వద్ద కొనసాగుతున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను ముప్పు శ్రీనివాస్ రెడ్డి మరియు జీవన్ రెడ్డి స్వయంగా తనిఖీ చేసి పర్యవేక్షించారు. పనులు పూర్తిగా పూర్తయ్యే వరకు నిరంతరంగా రోజువారీ పర్యవేక్షణ కొనసాగుతుందని ఆ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మంగ సంతోష్, ఆల్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మజేటి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాజు మరియు సభ్యులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు పేదల కలల గృహాలు.. డిసిసి ఉప అధ్యక్షుడు మహేష్ గౌడ్

## పకీర్ టేక్య తండాలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్..







**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ నియోజకవర్గం ఎంఎంసి ఘట్కేసర్ సర్కిల్, ఎదులాబాద్ 7వ డివిజన్, ఘనపురం గ్రామ పరిధిలోని ఫకీర్ టేక్య తండా లోని వద్యా జ్యోతి, నానావత్ బుజ్జి నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ అనంతరం మహేష్ గౌడ్ మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదల కలల్ని సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు ప్రతి గృహప్రవేశం ఒక చిన్న పండుగలా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం హయాంలో అభివృద్ధి శకం మొదలైందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం ప్రజల నమ్మకానికి నిలువెత్తు నిదర్శనమని,గత ప్రభుత్వం పేదలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందని, కానీ నేటి ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపించి పేదలకు శాశ్వత నివాసాలను కల్పిస్తోందని, ఇంటి నిర్మాణంలో దశలవారీగా నిధులు విడుదల చేస్తూ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో ఘనపురం గ్రామ మాజీ సర్పంచ్లు నానావత్ రూప్ సింగ్ నాయక్,వేముల మమత గౌడ్, బద్దం గోపాల్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ వేముల సత్తయ్య గౌడ్, ఇందిరమ్మ కమిటి సభ్యులు గుర్జకుంట నర్సింహా,నానావత్ శివాజీ నాయక్,మాజీ వార్డు సభ్యులు బింగి సురేష్ గౌడ్,వద్యా జైహిందర్ నాయక్, వద్యా చాంది, నానావత్ సురేష్ నాయక్, రామావత్ రాణి, నాయకులు కొంశెట్టి శ్రవణ్, వద్యా సురేష్ నాయక్, వద్యా దేవ్ సింగ్ నాయక్,మూడవత్ చందర్, నానావత్ రాజ్ కుమార్, రామావత్ మల్లికార్జున్ మరియు గ్రామస్తులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# శంకర్పల్లి మున్సిపాలిటీ 8వ వార్డులో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ఎస్. ప్రవీణ్ కుమార్..





**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫతేపురం 8వ వార్డులో బుధవారం షాబాద్ మానెమ్మ, టంగుటూరి తులసి ఇందిరమ్మండ్లను స్థానిక మునిసిపాలిటీ చైర్మన్ ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభమవుతుందని తెలిపారు. ఇల్లు లేని వారికి ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి , మున్సిపల్ కమిషనర్ యోగేష్, ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పీచరి అఖిల యాదవ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేడిపల్లి యాదయ్య గౌడ్, సుక్క రెడ్డి, ఈ. బాలకృష్ణ రెడ్డి ఎస్. రాజశేఖర్ రెడ్డి, జి. మహిపాల్ రెడ్డి, ఎస్. సంజీవ, రాజేష్, సిహెచ్. పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలుడి మిస్సింగ్ కేసు నమోదు..



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలుడు అదృశ్యం అయిన ఘటన నమోదు జరిగింది. ఫిర్యాదు దారునీ వివరాలు ఇలా ఉన్నాయి.ఫిర్యాదుదారుడు కాంతం వెంకటేష్, వయస్సు 26 సంవత్సరాలు, , నివాసం దమ్మాయిగూడ, తెలిపిన వివరాల ప్రకారం, రెండు వారాల క్రితం ఆయన తల్లిదండ్రులు కె. మంగమ్మ మరియు కె. బాలరాజు శాద్‌నగర్‌లోని బంధువు బి. అంజనేయులు ఇంటికి వెళ్లగా, అక్కడ కె. బాలరాజు ప్రమాదవశాత్తు జారి పడినట్లు తెలిపారు. అనంతరం ఆయన తల్లి కె. మంగమ్మ మరియు బావమరిది బి. గణేష్ (16 సంవత్సరాలు) కలిసి ఎల్‌బి నగర్ అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి తిరిగి దమ్మాయిగూడకు తీసుకొచ్చారు. తేదీ 12.05.2026 ఉదయం సుమారు 09:40 గంటలకు బి. గణేష్ తాను తిరిగి శాద్‌నగర్‌కు వెళ్తానని చెప్పగా, ఫిర్యాదుదారుడి స్నేహితుడు మామిళ్ల శ్రీకాంత్ అతడిని ఈసీఐఎల్ బస్ స్టాప్ సమీపంలోని సతీ రెడ్డి వీధి వద్ద దింపినట్లు తెలిపారు. అనంతరం గణేష్ ఇంటికి చేరాడా అని ఫిర్యాదుదారుడు తన మామను సంప్రదించగా, అతడు ఇంటికి చేరలేదని తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులు మరియు బంధువులు అన్ని ప్రాంతాల్లో గాలించినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు. మిస్సింగ్ అయిన బాలుడు బి. గణేష్ వేసవి సెలవుల్లో ఇంటికి వెళ్లాలని ఇష్టపడకపోయినా, తల్లిదండ్రుల ఒత్తిడి కారణంగా ఈసీఐఎల్‌కు వచ్చి తిరిగి శాద్‌నగర్‌కు వెళ్లేందుకు బయలుదేరినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు కుషాయిగూడ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎల్.భాస్కర్ రెడ్డి తెలిపారు.

# జన గణనలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి ఆంజనేయులు** జన గణనలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. బుధవారం అల్లాదుర్గం మండలంలోని గడి పెద్దాపూర్ గ్రామంలోని జనగణన 2027 ను తాహాసిల్దార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..1881 సంవత్సరం నుండి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి సెన్సస్ నిర్వహించబడుతోందని, కోవిడ్ కారణంగా ఆలస్యమైనప్పటికి ఇప్పుడు 16వ జన గణన చేపడుతున్నామని తెలిపారు. సర్వేలకు భిన్నంగా సెన్సస్ చట్టబద్ధంగా నిర్వహించబడే ప్రక్రియ అని, ఇందులో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలను ఇవ్వాలని, ఎవరూ సమాచారం దాచకూడదని స్పష్టం చేశారు. జనగణన రెండు దశల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. మే 11 నుండి జూన్ 9 వరకు మొదటి దశగా హౌస్ లిస్టింగ్ చేపట్టి ఇళ్లకు సంబంధించిన 33 ప్రశ్నలపై వివరాలు సేకరిస్తామని చెప్పారు. ఇందులో నీటి కనెక్షన్, మరుగుదొడ్డి, గ్యాస్ కనెక్షన్, ఫోన్, ఇంటర్నెట్, తరచుగా వినియోగించే ఆహార ధాన్యాలు వంటి అంశాలు నమోదు చేస్తారని మొత్తం 33 ప్రశ్నల ద్వారా గృహ వివరాలు సేకరించి డిజిటల్‌గా భద్రపరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో ఇంటింటి సర్వే



**దుండిగల్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కిరణ్ మాట్లాడుతూ, జనగణన--2027 తొలి దశ గణన కార్యక్రమం రేపటి నుండి జూన్ 9 వరకు ఇంటింటి సర్వే రూపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా ప్రతి ఇంటి ప్రాథమిక వివరాలు, కుటుంబ సభ్యుల సంఖ్య, నివాస పరిస్థితులు మరియు ఇతర అవసరమైన సమాచారం సేకరించబడుతుందని వెల్లడించారు.జనగణన ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఇంటింటికి వచ్చే గణన సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. సరైన మరియు ఖచ్చితమైన సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వానికి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంలో ఉపయోగపడుతుందని వివరించారు.జనగణన ద్వారా విద్య, వైద్యం, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలు వంటి అనేక రంగాలకు అవసరమైన గణాంకాలు సిద్ధమవుతాయని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో జనగణన కార్యక్రమం విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రతి కుటుంబం ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని గణన సిబ్బందికి సహకరించాలని దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కిరణ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## డ్రైవర్ శివం కి రావలసిన వేతనం ఇప్పించిన

### బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** మేడ్చల్ నియోజకవర్గంలోని పూడూరు లో" శివం అనే డ్రైవర్ గత కొన్ని సంవత్సరాలుగా డీసీఎం డ్రైవర్ గా పని చేయడం జరుగుతుంది... కొన్ని అనివార్య కారణాల వల్ల ఓనర్ యాదగిరి, డ్రైవర్ శివం నీ డ్యూటీ లో నుంచి తీసివేయడం జరిగింది... డీసీఎం ఓనర్ యాదగిరి, ఒక నెల వేతనం మొత్తం 16000/- వేల రూపాయలు డ్రైవర్ కి ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వకుండా డ్రైవర్ శివం ని ఇబ్బంది పెడుతూ ఇవ్వాల్సిన వేతనం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తూ అతని పంపించేవాడు అతనికి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి డ్రైవర్ మిత్రుల ద్వారా తెలుసుకొని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి అతని కార్యాలయం వద్దకు వెళ్లి డ్రైవర్ శివం కి జరిగిన అన్యాయం గురించి చెప్పుకున్నాడు.. ఆ తర్వాత వెంటనే స్పందించిన రవి హుటాహుటిన డీసీఎం ఓనర్ యాదగిరి దగ్గరికి వెళ్లి అతని తో మాట్లాడి శివం కి రావలసిన వేత్తనం గురించి వివరించారు ఒక నెల వేత్తనం మొత్తం 16000/- వేల రూపాయలు, డ్రైవర్ శివం ఇప్పించడం జరిగింది... డ్రైవర్ శివం, మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు... ఈ కార్యక్రమంలో... అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ చట్టలకు, నిబంధనలకు విరుద్ధంగా విక్రహిస్తున్న మద్యం షాపులు వెంటనే తొలగించాలి





### -సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్

**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** గండిమైసమ్మ చౌరస్తా నుండి మియాపూర్ వరకు మెయిన్ రోడ్డు పై ఉన్న మద్యం పాలసీలకి విరుద్ధంగా ఉన్న మద్యం షాపులను వెంటనే తొలగించాలని సిపిఐ ఆధ్వర్యంలో ఎక్సైజ్ డిపార్ట్మెంట్ పోలీసు సీఐకీ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ మద్యం పాలసీ ప్రకారం మెయిన్ రోడ్డులు, జాతీయ రహదారులో, గుడులు, పాఠశాలలకు కనీసం వంద మీటర్ల దూరంలో మద్యం విక్రహించాలి అని గుర్తు చేశారు. కానీ రహదారులో మద్యం పాలసీకి వెతిరేకంగా మెయిన్ రోడ్డుపై ఏదేచ్చగా మద్యం విక్రయలు కొనసాగుతున్నాయి అని అన్నారు. ముఖ్యంగా వి- లిక్కర్, చివాస్ వైన్ షాప్, స్పిరిట్ వైన్ షాప్, ఎస్విడీ లిక్కర్ షాప్ తదితర మద్యం షాప్లు ఎక్సైజ్ పాలసీ, నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తున్నారు అని వారు అన్నారు. రీసెంట్గా వి-లిక్కర్ వైన్ షాప్ వద్ద రహదారి పై వెళ్తున్న ఒక షిఫ్ట్ కారు సడన్ గా వి-లిక్కర్ వైన్ షాప్ వద్ద ఆగడం వల్ల వెనక నుండి వస్తున్న వాటర్ ట్యాంక్ కారును బలంగా గుద్దడం వల్ల కారు వెనక భాగం డ్యామేజ్ అయింది. అలాంటి అనేక సంఘటనలు రహదారుల పై జరగడం సర్వసధారణం అవుతున్నాయి. తద్వారా అమాయకుల ప్రాణాలు పోతున్నాయి అని అన్నారు. కనుక మద్యం పాలసీ, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న మద్యం షాపులను వెంటనే తొలగించాలని, అలాగే నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రశాంత్ హిల్స్, ఇంద్రన్న కాలనీ, రాజీవ్ గృహకల్ప, సాయి నగర్, ఎన్టీఆర్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, ఇందిరమ్మ కాలనీ, తదితర ప్రాంతాలలోని మద్యం బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పొన్నాకంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ సాయినగర్ కాలనీలో టాటా మోటార్స్ వద్ద అగ్ని ప్రమాదం..



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్**/మేడ్చల్ జిల్లా కాప్ర మండలం కుషాయిగూడ, కాప్రా పరిధిలోని సాయినగర్ కాలనీలో టాటా మోటార్స్ సమీపంలో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భవనం నుంచి ఎగిసిపడిన దట్టమైన నల్ల పొగతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు.ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం, సాయినగర్ కాలనీలో టాటా మోటార్స్ నిర్వహిస్తున్న ఒక షెడ్‌లో మధ్యాహ్న సమయంలో ఈ అగ్ని ప్రమాదం సంభవించింది. భారీగా ఎగిసిన నల్ల పొగ సమీప రహదారులు మరియు నివాస ప్రాంతాలపై వ్యాపించి, దూరం వరకు కనిపించింది.స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ మరియు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. మంటలు సమీప భవనాలు మరియు పార్క్ చేసిన వాహనాలకు వ్యాపించకుండా అధికారులు పరిసర ప్రాంతాలను ఖాళీ చేయించారు.ఈ అగ్ని ప్రమాదానికి ఈవీ బ్యాటరీ పేలుడు కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అయితే ఖచ్చితమైన కారణాన్ని నిర్ధారించేందుకు అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టనున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, దహన పదార్థాలు లేదా ఇతర సాంకేతిక కారణాల వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.ఈ ఘటనలో ఎవరైనా గాయపడినట్లు లేదా ప్రాణనష్టం జరిగినట్లు అధికారిక సమాచారం ఇంకా వెలువడలేదు. అయితే భారీగా వ్యాపించిన పొగ మరియు మంటల తీవ్రత స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగించింది. ఈ ఘటన కారణంగా కుషాయిగూడ మరియు కాప్రా ప్రాంతాల్లో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అత్యవసర సేవా వాహనాలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలికి చేరుకోవడంతో రద్దీ నెలకొంది.

# పోక్సో బాధితులకు వేగవంతమైన సహాయం అందించాలి

## భరోసా సెంటర్‌ను తనిఖీ చేసిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్






**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి ఆంజనేయులు** లైంగిక వేధింపులకు గురైన మహిళలు, బాలలకు భరోసా సెంటర్ ద్వారా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను ఆయన సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించిన అదనపు ఎస్పీ.. పోక్సో కేసులు, లైంగిక వేధింపుల బాధితుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, మానసిక కౌన్సిలింగ్, న్యాయ సహాయం, అవగాహన కార్యక్రమాల అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు.లైంగిక దాడులు, వేధింపులకు గురైన మహిళలు, బాలల పట్ల సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. బాధితుల్లో భయాందోళనలు తొలగించి ధైర్యం కల్పించాలని, ప్రతి కేసులో సకాలంలో న్యాయ, వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే బాధితులకు మానసిక బలం చేకూర్చే విధంగా కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. పోక్సో చట్టాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. వేధింపులు, అత్యాచారాలు, నిరాదరణకు గురైన మహిళలు, పిల్లలకు ఒకే చోట న్యాయపరమైన, వైద్యపరమైన సేవలు, సామాజిక భద్రత, మానసిక ధైర్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర పోలీస్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో భరోసా సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాధితులకు అవసరమైన అన్ని సేవలను సమన్వయంతో అందిస్తున్నామని చెప్పారు.

లైంగిక వేధింపులకు గురైన వారు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు. మహిళలు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు కఠినంగా అమలులో ఉన్నాయని, లైంగిక వేధింపులు లేదా దాడులకు పాల్పడిన వారికి కఠినమైన జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, లీగల్ అడ్వైజర్ శ్వేతతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కాప్రా డిసి శ్రీహరి ఆధ్వర్యంలో తడి చెత్తా, పొడి చెత్తా పై అవగాహన కార్యక్రమం లో సూపర్ వైజర్ సుదర్శన్..



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ఆధ్వర్యంలో సక్రమమైన చెత్త నిర్వహణలో భాగంగా ఇంటి నుండి వ్యాపార స్థలాల నుండి వెలువడే చెత్తను తడి చెత్త,పొడి చెత్త,అజార్డర్ చెత్తగా విడదీయడం వలన ఉపయోగాల విషయం చెత్తను కలిపి వేయడం వలన వచ్చే అనర్థాలను ప్రజలకు తెలిసేట్టుగా, వివిధ కాలనీలు బస్తేనే యందు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కూరగాయల మార్కెట్, జమ్మిగడ్డ చౌరస్తా, నేతాజీ నగర్ చౌరస్తా, ప్రాంతాలలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో డిఈ సాలిడ్వ్యయేషన్ మేనేజ్మెంట్ రవి సాంటరి సూపర్వైజర్ సుదర్శన్ జవాన్ రాజన్ జవాన్ రామకృష్ణ ఎస్. ఎఫ్. ఏ ప్రసాద్ అరవింద్, అశ్విన్ ప్రసాద్, వై.కుమార్, శిరీష, కూరగాయల మార్కెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి వారి సభ్యులు కూరగాయల మార్కెట్ వ్యాపారస్తులు వినియోగదారులు మరియు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు చెత్తను వేరుచేసి తడి చెత్తను అనగా కిచెన్ వేస్ట్, హోం కంపోస్ట్ తయారు చేసుకుని మొక్కలకు గార్డెనింగ్ కు వినియోగించుకోవాలని తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి మనందరం బాధ్యతగా వ్యవహరించాలని తెలియజేశారు.



# వివాహ వేడుకలు పాల్గొన్న వీరశైవ లింగాయత్ సమాజం



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాసదాశివపేట లోని జగద్గురు సేవా సదన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన స్థానిక వాణి రవి స్వామిల కుమారుడి మరకత లింగం ఆలయ ప్రధాన పూజారి శ్రీ ప్రమోద్ కుమార్ శ్రీ వందిత వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా సలహాదారులు అమ్మిశెట్టి జయప్రకాష్, జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు మడుపతి సంతోష్ కుమార్ స్వామి వారిని వధూవరులకు ఆశీర్వదించడం జరిగింది

# గీతంలో పాఠశాల విద్యార్థుల కోసం యంగ్ ఎంటర్ ప్రెన్యూర్స్ ప్రోగ్రామ్

**వాస్తవ తెలంగాణ పటాన్ చెరు న్యూస్** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని వెంచర్ డెవలప్ మెంట్ సెంటర్ (వీడీసీ) 8 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం మూడు రోజుల యంగ్ ఎంటర్ ప్రెన్యూర్స్ ప్రోగ్రామ్ (వైఎల్పీ) స్టార్టప్ బూట్ క్యాంపును నిర్వహించనుంది. ఈ కార్యక్రమం అనుభవపూర్వక, కార్యాచరణ-ఆధారిత అభ్యాసం ద్వారా యువ అభ్యాసకులలో వ్యవస్థాపక ఆలోచనా విధానం, సృజనాత్మకత, నాయకత్వం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో పాల్గొనేవారు ఆరు వేల రూపాయలతో పాటు జీఎస్టీని కూడా చెల్లించాల్సి ఉంటుంది. వైఎల్పీ ఒక ప్రాక్టికల్, పూర్తిగా లీనమయ్యే బ్యూట్ క్యాంపు. ఇది విద్యార్థులకు అవకాశాలను గుర్తించడం, వినూత్న ఆలోచనలను అభివృద్ధి చేయడం, స్టార్టప్ వ్యవస్థాపకుల వలె పరిష్కారాలను కనుగొనడంలో సహాయపడటం ద్వారా, వారికి వ్యవస్థాపకత యొక్క ప్రాథమిక అంశాలను పరిచయం చేస్తుంది. సాంప్రదాయ తరగతి గది అభ్యాసానికి భిన్నంగా, ఈ కార్యక్రమం బృంద ఆధారితమైన, ముఖాముఖిగా కొనసాగి, ఆచరణాత్మక అనుభవంపై దృష్టి పెడుతుంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి ప్రపంచంలో వ్యవస్థాపక నైపుణ్యాల ప్రాముఖ్యతను చాటిచెబుతూ, భవిష్యత్ విజయానికి విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, భావప్రకటన, దృఢత్వం, ఆవిష్కరణ వంటి లక్షణాలు అత్యవసరం అయ్యాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ప్రారంభ దశలోనే ఆయా నైపుణ్యాలను సమకూర్చి, వారిని ఆత్మవిశ్వాసం కలిగిన నాయకులుగా, మార్పు తీసుకువచ్చే వారిగా తీర్చిదిద్దేలా రూపొందించారు. ఈ మూడు రోజుల బ్యూట్ క్యాంపులో వ్యవస్థాపక మనస్తత్వం, అవకాశాలను గుర్తించడం, డిజైన్ థింకింగ్, వ్యాపార నమూనాలు, వినియోగదారులను అర్థం చేసుకోవడం, స్టార్టప్ ఆలోచనను అభివృద్ధి చేయడం, కథ చెప్పడం, ప్రజెంటేషన్ నైపుణ్యాలు, పిచింగ్ టెక్నిక్ లను వివరించే ఒక క్రమబద్ధమైన పాఠ్యప్రణాళికతో సాగనుంది. తొలి రోజున, విద్యార్థులు వ్యవస్థాపక మనస్తత్వం, వాస్తవ ప్రపంచ సమస్యలను గుర్తించడం, డిజైన్ థింకింగ్, బృంద ఏర్పాటు, ఆలోచనల మథనం వంటి అంశాలపై జరిగే సెషన్ల ద్వారా 'వ్యవస్థాపకుడిగా యోచించడం' నేర్చుకుంటారు. 'మీ ఆలోచనను రూపొందించుకోండి' శీర్షికన జరిగే రెండవ రోజు సెషన్, వ్యాపార నమూనాలను అర్థం చేసుకోవడం, వినియోగదారుల అవసరాలు, స్టార్టప్ ఆలోచనలను మెరుగుపరచడం, ఒక సరళమైన స్టార్టప్ కాన్వాస్ ను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తుంది. ఇక మూడవ రోజు, 'ఆత్మవిశ్వాసంతో ఏర్పాటు చేయండి' అనే కార్యక్రమంలో పాల్గొనేవారికి కథ చెప్పడం, ప్రజెంటేషన్ నైపుణ్యాలు, ప్రశ్నలను ఎదుర్కోవడం, 'షార్క్ ట్యాంక్'-శైలి పిచ్ సెషన్లో ఒక ప్యానెల్ ముందు తమ స్టార్టప్ ఆలోచనలను ప్రదర్శించడం వంటి అంశాలలో శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమం ముగిసేనాటికి, ఇందులో పాల్గొనేవారు వ్యవస్థాపక మనస్తత్వం, మెరుగైన విమర్శనాత్మక ఆలోచనా సామర్థ్యాలు, జట్టు కృషి, సహకార నైపుణ్యాలు, బహిరంగ ప్రసంగంలో ఆత్మవిశ్వాసం, ఇంకా బూట్ క్యాంప్ సమయంలో అభివృద్ధి చేసిన ఒక క్రమబద్ధమైన స్టార్టప్ ఆలోచనను పొందుతారు. అలాగే దీనిని విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులు గీతం వీడీసీని నుంచి ఒక ధ్రువీకరణ పత్రాన్ని కూడా అందుకుంటారు. స్టార్టప్ లు, ఆవిష్కరణలు, వ్యాపారం, సృజనాత్మక సమస్య పరిష్కారం, నాయకత్వం, భావప్రకటనా నైపుణ్యాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపకరిస్తుంది. అంతే కాకుండా, ఇది యువ అభ్యాసకులకు విశ్వవిద్యాలయ ప్రాంగణ జీవితంపై విలువైన అవగాహనను, గీతం వీడీసీతో అనుబంధం ఉన్న నిపుణుల నుంచి మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. మరిన్ని వివరాల కోసం వీడీసీ ఉప సంచాలకుడు మహేష్ వారియర్ ౦91 9036217587ను, లేదా mvarier@gitam.edబ కు ఈ-మెయిల్ చేయడం ద్వారా గానీ సంప్రదించవచ్చు.

# పేట్‌బషీరాబాద్‌లో చైన్ స్నాచింగ్ కేసు ఛేదన : నిందితుడు అరెస్ట్



**పేట్‌బషీరాబాద్ వాస్తవ తెలంగాణ న్యూస్** మే 7, 2026 ఉదయం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ధూలపల్లి టీ-జంక్షన్ దగ్గర 4 తులాల బంగారు మంగళసూత్రం లాక్కెళ్లిన కేసును పోలీసులు ఛేదించారు. మహారాష్ట్ర నాసిక్‌కు చెందిన హసన్ అలీ (37)ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితుడు ముస్తఫా పరారీలో ఉన్నాడు. నిజామాబాద్‌లో టీవీఎస్ బైక్ దొంగిలించి, మేడ్చల్‌లో ఒక చైన్ స్నాచింగ్, అనంతరం ధూలపల్లి వద్ద మరో చైన్ లాక్కొని నిందితులు పారడైజ్ వద్ద బైక్ వదిలేసి స్వగ్రామానికి పారిపోయారు. సీసీటీవీ ఫుటేజ్, టెక్నికల్ ఎవిడెన్స్‌తో కుత్బుల్లాపూర్ డీసీపీ కోటి రెడ్డి పర్యవేక్షణలో పేట్‌బషీరాబాద్ పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. ముస్తఫా కోసం, గోల్డ్ చైన్ రికవరీ కోసం దర్యాప్తు కొనసాగుతోంది.


# జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**జిన్నారం వాస్తవ తెలంగాణ న్యూస్** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ విద్యారంగంలో చేపట్టిన సంస్కరణల మూలంగా నేడు అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యా వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, ఇంటరాక్టు డిజిటల్ ప్యానెల్స్ ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యారంగానికి దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలు అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. దీని మూలంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు సైతం దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. డిగ్రీ, పీజీ, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో ప్రముఖ కార్పొరేట్ కంపెనీలతో క్యాంపస్ ఇంటర్వ్యూలు ఏర్పాటు చేస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయకుండా లక్ష్యంతో చదివి ఉన్నత విజయాలు సాధించాలని విజ్ఞప్తి చేశారు. జిన్నారం జూనియర్ కళాశాల రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలని సూచించారు. కళాశాల అభివృద్ధి కోసం మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. కళాశాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. అతి త్వరలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, గడ్డపోతారం మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణకుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి

**వాస్తవ తెలంగాణ పటాన్ చెరు న్యూస్** పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ డివిజన్‌లో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ లచ్చిరామ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించగా, పటాన్‌చెరు నియోజకవర్గ బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి హాజరై ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాబ్జీ , బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి , సంపత్ , మునీందర్ తదితరులు పాల్గొన్నారు.



# సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన ను కలిసిన కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్



**కూకట్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్** నియోజకవర్గ సమస్యల పరిష్కారార్థమై టి పి సి సి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ బుధవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన ను కలిశారు. సమస్యలపై విస్తృతంగా చర్చించారు హౌసింగ్ బోర్డ్ నుండి హఫీజ్పేట్ వెళ్లే రోడ్డు ను విస్తరించి కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని, స్వాన్ లేక్ నాలా అసంపూర్తిగా ఉందని దాన్ని పూర్తి చేయాలని భువన విజయం షటిల్ గ్రౌండ్ మెయింటెనెన్స్ ను ప్రైవేట్ వ్యక్తుల నుంచి తీసుకొని జిహెచ్ఎంసి ఆధ్వర్యంలోని నిర్వహణ చేయాలని రమేష్ కమిషనర్ ను కోరారు. కెపిహెచ్బి కాలనీ పరిధిలోని ఎమినిటీస్ కోసం వదిలిన స్థలాలు అన్నిటికీ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. జిల్లా గ్రంధాలయ సంస్థ కేపీహెచ్బీ కాలనీలో ఏర్పాటు చేయాలని, అదేవిధంగా కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ కు కమ్యూనిటీ హాల్ ను కేటాయించాలని రమేష్ వినతిపత్రంలో పేర్కొన్నారు. అల్లాపూర్ స్మశాన వాటిక మిగిలిపోయిన పనులు త్వరగా పూర్తిచేసిజూన్ 2న ప్రారంభించాలని సిఎంసి కమిషనర్ కు రమేష్ సూచించారు. ఆయా పనులు విషయమై ఆమె సానుకూలంగా స్పందించినట్లు రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గాలి బాలాజీ, గొట్టుముక్కల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.





# ప్రధాని.. పొదుపు మంత్ర !

## కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించాలని ఆదేశం

- అలాగే ఎస్కార్ట్, భద్రత సిబ్బంది కూడా కుదింపు
- సాధ్యమైనంతవరకు ఈవీ వాహనాలు ఉండాలని సూచన
- మోదీ బాటలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కూడా..

ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమౌతున్నాయి. సంవత్సరం పాటు బంగారం కొనుగోళ్లను నిలిపివేయాలని మోదీ సూచించారు. బంగారాన్ని కొనకుండా ఉండాలని కోరారు. వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతులను అవలంబించాలని, దేశీయ లేదా అంతర్జాతీయ అనవసర ప్రయాణాలను తగ్గించుకోవాలని చెప్పారు. పెట్రోల్, డీజిల్‌తో పాటు చివరికి వంటనూనె వినియోగాన్ని సైతం తగ్గించుకోవాలని సూచించారు. ఈ పరిణామాల మధ్య ఆయన అతిపెద్ద నిర్ణయాన్ని తీసుకున్నారు. తన కాన్వాయ్ పరిమాణాన్ని 50శాతం తగ్గించాలని ఆదేశించారు. పెట్రోల్, డీజిల్ ఆదా, విస్తృత ఆర్థిక పొదుపు చర్యలలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలను ఎక్కువగా ఉపయోగించాలని సూచించారు. ఇరాన్ యుద్ధంతో ముడిపడి ఉన్న ఆర్థిక సంక్షోభం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ప్రధాని కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించాలని స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌కు సూచనలు జారీ అయ్యాయి. తప్పనిసరి భద్రతా నిబంధనలకు ఎటువంటి భంగం వాటిల్లకుండా చూసుకోవాలని మోదీ స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను ఎస్పీజీ ఇప్పటికే అమలు చేయడం ప్రారంభించింది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని ప్రధాని మోదీ కోరారు. దీని కోసం కొత్త వాహనాలను కొనుగోలు చేయరాదని చెప్పారు. వాస్తవ తెలంగాణ

## యూపీ ముఖ్యమంత్రి కూడా..

కాగా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా మోదీ బాట పట్టారు. తనతో పాటు మంత్రులు, అధికారులు, ఇతర వీఐపీ వాహన కాన్వాయ్‌లను 50 శాతం తగ్గించాలని ఆయన ఆదేశించారు. ఆ దిశగా తాజా ఆదేశాలను ఇచ్చారు. ఉత్తర ప్రదేశ్‌లో ప్రజా ప్రతినిధులు స్వచ్ఛందంగా అధికారిక వాహనాల వినియోగాన్ని, భద్రతా సిబ్బందిని తగ్గించుకుంటున్నారు. పొదుపునకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం. వర్క్ ఫ్రమ్ హోమ్ సంస్కృతికి ప్రాధాన్యత ఇవ్వాలని కూడా యోగి ఆదిత్యనాథ్ కోరారు. ఉత్తర ప్రదేశ్ నుంచి కార్యకలాపాలు కొనసాగిస్తున్న అన్ని కార్పొరేట్ కంపెనీలు, ఐటీ దిగ్గజ సంస్థలు తమ ఉద్యోగులకు ఇంటి నుంచే పని చేసే వెసులుబాటును కల్పించాల్సి ఉంటుంది. దీని ప్రభావం గ్రేటర్ నొయిడాపై పడొచ్చు. ఇక్కడి ఐటీ హబ్ మొత్తం కూడా బోసి పోవచ్చు. దీంతో పాటు పీఎన్‌జీ, మెట్రో సేవలు, ప్రభుత్వ రవాణా వ్యవస్థల వినియోగానికి ఆయన ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారు యోగి ఆదిత్యనాథ్. సదస్సులు, ప్రభుత్వ సమావేశాలు, సెమినార్లు వంటి కార్యక్రమాలను కూడా వర్చువల్‌గా నిర్వహించాలని సూచించారు.

